క్లుప్తంగా

కండక్టర్లు, డ్రైవర్లకు రక్షణ కల్పించాలి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ కండక్టర్లు డ్రైవర్లకు రక్షణ కల్పించాలని ఎస్ఎంయూ నాయకులు వినోద్, రెడ్డప్ప తెలిపారు. ఇటీవల మదనపల్లె సమీపంలోని చీకలబైలు వద్ద ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌పై కొందరు యువకులు దౌర్జనం చేసి దాడి చేశారన్నారు. మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కర్నూలుకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె సిటీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీఈ నెల 16న (రేపు) కర్నూలులో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె ఆర్టీసీ–1, 2 డిపోల నుంచి ఆర్టీసీ బస్సులను అధికారులు పంపనున్నారు. వన్ డిపో నుంచి 90 బస్సులు, టు డిపో నుంచి 53 బస్సులను ప్రధాని పర్యటనకు కేటాయించారు. దీంతో డిపోలో దూర ప్రాంతాల సర్వీసులు మినహాయించి అన్ని బస్సులు ప్రధానమంత్రి కార్యక్రమానికి కేటాయించినట్లు అయ్యింది. సాధారణ ప్రజల ప్రయాణానికి ఇబ్బందులు తప్పవనే వాదన వినిపిస్తోంది.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్

పీలేరు రూరల్ : బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు. మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహనతో జాగ్రత్త వహించాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు స్వర్ణ, అక్కయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మీ, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు



విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు

బి.కొత్తకోట : బాల్యవివాహాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయరాణి, నాగరత్నమ్మ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు అమలవుతున్న చట్టాలు, హక్కులపై వివరించారు. బాలికలపై అసమానతలు, వివక్షను రూపుమాపే చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పీలేరు రూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు లయన్స్‌క్లబ్ ప్లాటినం ప్రెసిడెంట్ జి.రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో తిరుపతి అమర హాస్పిటల్, అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో వివిధ జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 50 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చరణ్, డాక్టర్ సుమంత్, లయన్స్‌క్లబ్ ప్లాటినం కార్యదర్శి సురేష్, కోశాధికారి శివమణి, సభ్యులు సంజీవరెడ్డి, వేణుగోపాల్, రాజగోపాల్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పెద్దల సహకారంతోనే నకిలీ మద్యం తయారీ

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఎక్సైజ్ ఎస్ఐకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు రూరల్ : టీడీపీ పెద్దల సహకారంలో రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ జరిగిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పీలేరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నకిలీ మద్యాన్ని అరికట్టాలనే నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కేవలం స్పిరిట్, రసాయనాలతో నకిలీ మద్యం తయారీ చేసి పాపులర్ బ్రాండ్లను తలపించేలా బాటిళ్లపై నకిలీ లేబుల్స్ అంటించి సరఫరా చేయడం చూస్తుంటే చాలా ఆందోళన కలుగుతోందన్నారు. ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో భారీ స్థాయిలో కుటీర పరిశ్రమను తలపించేలా యంత్రాలు బయటపడ్డాయన్నారు. కొన్ని నెలలుగా నెల్లూరు, విజయవాడ, ఏలూరు, పాలకొల్లు, పరవాడ ప్రాంతాల్లో నకిలీ మద్యం పట్టుపడినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 421 మంది నకిలీ మద్యం వల్ల మరణించినట్లు ప్రచార మాధ్యమాల ద్వారా తెలిసిందన్నారు. గత ప్రభుత్వం పారదర్శకంగా లిక్కర్ విధానం అమలు చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం గత మద్యం విధానాలు రద్దు చేసి వైన్‌షాపులు పెంచడంతోపాటు ప్రయివేట్ వారికి అప్పగించిందన్నారు. ఎటుచూసినా బెల్టుషాపులు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. దీంతో మహిళలకు రక్షణ కొరవడిందని శాంతి భద్రతలపై ప్రభావం చూపుతోందని, 16 నెలల్లో క్రైంరేటు భాగా పెరిగిందని తెలిపారు. ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంలో తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, అతని భావమరిది గిరిధర్‌రెడ్డి, కబ్జా సురేంద్రనాయుడు, అనుచరుడు జనార్థన్‌రావు అందరూ టీడీపీకి చెందినవారేనని తెలిపారు. నకిలీ మద్యంతో ఒక్క ఏడాదిలో రూ. 5,280 కోట్లు టీడీపీ ముఠా దోచుకున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. నకిలీ మద్యంతో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అనంతరం ఎక్సైజ్ ఎస్ఐ చైతన్యకు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో ఎంపీపీ సతీష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ముక్తియార్, నాయకులు హబీబ్‌బాషా, చంద్రారెడ్డి, అమరనాథరెడ్డి, మహితాఆనంద్, పెద్దోడు హరిత, ఎస్.వి. చలపతి, రాహుల్‌రెడ్డి, చక్రధర్, బుల్లెట్ శేఖర్, మధుసూదన్ రెడ్డి, నారే వెంకటరమణారెడ్డి, వి.పి. రమేష్‌రెడ్డి, కాలనీ చిన్న, ఉదయ్‌కుమార్, షాకీర్, మునీర్, అబీద్, దావూద్, ఉబేదుల్లా, అరుణ, మల్లేశ్వరి, రాజేశ్వరి, రాజ్యలక్ష్మీ, సపూరా, అబ్దుల్ కలీమ్, నీళ్ల భాస్కర్, సురేష్‌కుమార్‌రెడ్డి, ఆనంద్, అమీర్‌అలికాన్, రెడ్డినరసింహారెడ్డి, రవినాయక్, రమణ, శివ, ఖాదర్, ద్వారకనాథరెడ్డి, దినేష్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, జయరామచంద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మస్తాన్ అహ్మద్, ప్రకాష్‌రెడ్డి, వెంకటప్రసాద్‌రెడ్డి, హరి, శివాజి, సతీష్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యానికి జీవన ఎరువులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మదనపల్లె రూరల్ : నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే జీవన ఎరువుల వాడకం తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కె.నవీన్ రెడ్డి అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచనల మేరకు జీవన ఎరువుల ప్రాముఖ్యతపై కేవీకేలు, జిల్లా ఏరువాక కేంద్రాల ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా దండువారిపల్లెలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కె.మంజుల కో–ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయంలో అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో భూమిలో, ఉపరితలంపైనా పర్యావరణ కాలుష్యంతో పాటు రైతులకు పెట్టుబడి అధికమవుతోందన్నారు. భూమిలో రైతులకు మేలుచేసే సూక్ష్మాంగ జీవులు తగ్గిపోతున్నాయన్నారు. మొక్కకు పోషకపదార్థాలు, హార్మోన్‌లు సమకూర్చే వీలులేకుండా పోతోందని చెప్పారు. జీవన ఎరువులు వాడటం వల్ల నేలలో మార్పులు జరిగి రైతుకు మేలు చేసే మిత్ర సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుందన్నారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడమే కాకుండా నేల నుంచి సంక్రమించే తెగుళ్లను కొంతమేర తగ్గించవచ్చన్నారు. నేల భౌతిక లక్షణాలు బాగుపడి భూసారం అభివృద్ధి చెందుతుందన్నారు. సేద్యవిభాగ శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు మాట్లాడుతూ జీవన ఎరువులు ఏ పంటకు ఎంత మోతాదులో, ఎలా వాడాలో తెలియజేశారు. విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.మాధురి మాట్లాడుతూ వన ఎరువుల వాడకం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. జీవన ఎరువుల కొనుగోలుకు రైతులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి, కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిని సంప్రదించాలన్నారు. కావాల్సిన రైతులు 80085 00320 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

కలికిరి(వాల్మీకిపురం) : నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలం మంచూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ సయ్యద్‌బాషా అనారోగ్యంతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం స్విమ్స్ ఆసుపత్రికి చేరుకుని బాధితున్ని పరామర్శించారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరంలాంటిది



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలోని సిమెంట్, కొయ్యల దుకాణాల వద్ద జీఎస్టీ పై ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్డీయే ప్రభుత్వం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కింద పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి చేర్చారన్నారు. ఈ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం తగ్గించిందన్నారు. సిమెంట్ ధరలు తగ్గడంతో పేదలకు ఊరట లభించిందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో కొనుగోలు శక్తి పెరిగి దేశ జీడీపీ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునుస్వామి నాయక్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ స్కూల్ గుర్తింపు రద్దుచేయాలి



ఎంఈఓ ప్రభాకరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో పాఠశాలను నిర్వహించి, విద్యార్థి మృతికి కారణమైన అభ్యుదయ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఈఓ ప్రభాకరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యుదయ స్కూల్ యాజమాన్యం ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో, పదో తరగతి విద్యార్థి సాయికిరణ్, పాఠశాల వెనుక వైపు ఉన్న హంద్రీనీవా కాలువలో ఈతకు వెళ్లి మృతి చెందాడన్నారు. ఆదివారం ప్రత్యేక తరగతులు లేకుంటే, విద్యార్థి ఇంటిపట్టునే ఉండి మృతి చెందేవాడు కాదన్నారు. సాయికిరణ్ మృతికి కారణమైన స్కూల్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా అబ్బాయిలు, అమ్మాయిలకు ఒకే కాంప్లెక్స్‌లో హాస్టల్ నిర్వహిస్తుండటంపై విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థి సాయికిరణ్ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు గుండా మనోహర్, నాయకులు యమలా చంద్రయ్య, మల్లెల మోహన్, అప్పయ్య, ప్రశాంత్, గంగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



నూతన వరుడు జుల్ఫికర్ అహ్మద్‌ఖాన్‌ను ఆశీర్వదిస్తున్న ఆకేపాటి, తదితరులు

కలికిరి : మహల్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ కుమారుడు జుల్ఫికర్ అహ్మద్ ఖాన్ నిఖా కార్యక్రమం రాయచోటిలో జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, ఏపీఎండీసీ మాజీ డైరెక్టరు హరీష్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

సుండుపల్లె : ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. మంగళవారం సుండుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రధానోపాధ్యాయురాలు జక్రియ బేగం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ దేశ భవిష్యత్ ప్రణాళికలు రూపకల్పనలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పిల్లలు పాఠశాల స్థాయి నుంచి నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై చక్కటి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. వివిధ యాప్‌ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేటప్పుడు ఎవరికి ఓటీపీలు చెప్పకూడదని వాట్సాప్ లింకులను ఓపెన్ చేయరాదని అపరిచిత వ్యక్తులతో వాట్సాప్ చాటింగ్‌లు చేయరాదని పిల్లలకు అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అప్రమత్తత చేయాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మితిమీరిన అవినీతి

- ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే వైఫల్యం – సీపీఐ నాయకులు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి మితిమీరిపోయిందని, ప్రజాసమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి అన్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం నియోజకవర్గ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా, ఇప్పటి వరకు ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కడప – బెంగళూరు రైల్వేలేన్, బీటీ కళాశాలను యూనివర్సిటీ, మదనపల్లె జిల్లా ప్రకటన తదితర హామీలు కూటమి పెద్దలు పూర్తిగా మరచిపోయారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారన్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద పేదవాడికి వైద్యం అందడం లేదని ఆవేదనను తెలియజేశారు. మదనపల్లె–నిమ్మనపల్లె, రామసముద్రం–మదనపల్లె రోడ్లు గోతుల మయంగా మారాయని, ప్రమాదకరమైన మలుపుల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మున్సిపాలిటీ శానిటేషన్ విభాగంలో వర్కర్ల కొరత కారణంగా పట్టణంలో చెత్త పేరుకుపోతోందన్నారు. రెసిడెన్షియల్ ఏరియాల్లో కమర్షియల్ బిల్డింగ్‌ల నిర్మాణాలు జరుగుతున్నా, టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దినసరి, వారపు సంతకు వేలంపాటలు నిర్వహించక, ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల నష్టం జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, వాటిని పరిష్కరించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కె.మాధవ్, రెడ్డిశేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై హత్యాయత్నాలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోరా?



మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ కార్యదర్శితో చర్చిస్తున్న రైతు సంఘం నాయకులు

గుర్రంకొండ : గుర్రంకొండ మార్కెట్‌యార్డులో టమాటా రైతులపై హత్యాయత్నాలకు పాల్పడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోరా అంటూ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, జిల్లా కౌలురైతుల సంఘం కార్యదర్శి రమేష్‌బాబులు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో వారు పర్యటించి అక్కడ రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు వ్యాపారుల ఆగడాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయంకు చేరుకుని మార్కెట్‌కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని అధికారులు, పాలకవర్గం చేతకానితనంతోనే వ్యాపారులు రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. జాక్‌పాట్ వద్దన్నందుకు రైతులపై హత్యాయత్నాలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రైతులపై హత్యాయత్నాలకు పాల్పడిన వ్యాపారుల మండీల లైసెన్స్‌లు రద్దు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జాక్‌పాట్‌ను పూర్తిగా రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. పదిశాతం కమీషన్ కాకుండా రైతుల వద్ద నంచి 4 శాతం కమీషన్ మాత్రమే వ్యాపారులు తీసుకోవాలన్నారు. రైతులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు శ్రీనివాసులు, అమరనాథ్, రాజారెడ్డి, వెంకటరమణలు పాల్గొన్నారు.

పైప్‌లైన్ గుంతలతో ఇబ్బందులు

- రెండువారాలుగా తవ్వేసి పైపులు బిగించని వైనం
- సచివాలయాన్ని సంప్రదిస్తే నిర్లక్ష్యపు సమాధానం



పైప్‌లైన్ పనులు చేయకుండా వదిలేసిన గుంతలు

మదనపల్లె రూరల్ : మండలంలోని కోళ్లబైలు పంచాయతీ జగన్‌కాలనీలో పైప్‌లైన్ వేసేందుకు తవ్విన గుంతలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ పైప్‌లైన్ కోసం రెండు వారాల క్రితం తీసిన గుంతలు, పనులు చేయకుండా పంచాయతీ అధికారులు వదిలేయడంతో ఇళ్లలోకి వెళ్లేందుకు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ పైప్ లైన్ ఎప్పుడు వేస్తారని మంగళవారం కాలనీవాసులు బయ్యారెడ్డి కాలనీ కోళ్లబైలు–1 సచివాలయం సెక్రటరీని అడిగితే తమకు కూర్చునేందుకు కుర్చీలు లేవని, సొంతడబ్బులతో కొనుగోలు చేసుకున్నామని, పైపులకు ఆర్డర్ పెట్టాం. ఇంకా రాలేదు. ఎన్నిరోజులు పడుతుందో చెప్పలేం. మాకు వచ్చి చెబితే ఎలా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులు రాక ముందే, గుంతలు ఎందుకు తవ్వారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాటవేసిందన్నారు. గుంతల కారణంగా ఇళ్లకు వెళ్లేందుకు బాధలు పడాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు.

చిన్నపిల్లలకు టపాసులు అమ్మితే చర్యలు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెనగలూరు : దీపావళికి టపాసులు అంగళ్లు పెట్టేవారు చిన్నపిల్లలకు టపాసులు అమ్మితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అమరేశ్వరి అన్నారు. మంగళవారం దీపావళికి షాపులు పెట్టుకునేందుకు ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ టపాసులు దుకాణాలను హైస్కూల్‌లో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. టపాసుల దుకాణాల చుట్టుపక్కల ఎవరు పొగతాగకుండా చూసుకోవాలన్నారు. పొగ తాగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. అలాగే పోలీసులు, విద్యుత్ అధికారులు టపాసుల విక్రయదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, విద్యుత్ ఏఈ ఓబుల్ రెడ్డి, ఏఎస్ఐ రాముడు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గాలివీడు : గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్ అలీ హెచ్చరించారు. మంగళవారం ఆయన నూలివీడు, గాలివీడులో మొత్తం 3 మద్యం షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను రూపొందించిందని చెప్పారు. మద్యం కొనుగోలుదారులు తప్పనిసరిగా బాటిల్‌ను సరిచూసుకోవాలని, షాపులో డ్యూటీలో ఉన్న వ్యక్తి ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసి ఇవ్వాలని సూచించారు. అంతేకాక, వారి మొబైల్ ఎప్పుడూ ఆన్‌లో ఉంచుకోవాలని తెలియజేశారు. అనుమానం ఉంటే వెంటనే 14405 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

వైకల్యం చిన్నబోయేలా.. పతకాల పంట పండేలా

మదనపల్లె సిటీ : వారు ప్రత్యేక ప్రతిభావంతులు. కేవలం చదువులకే పరిమితం కాకుండా పారా క్రీడల్లో రాణిస్తున్నారు. వైకల్యం తమకు ఏ మాత్రం అడ్డురాదని ఆటల్లో రాణిస్తూ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు పొందుతూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మదనపల్లెలోని జవహర్ నవోదయలో ఇంటర్ చదువుతున్న హెచ్.వి.శివాని, కె.చందన పారా స్పోర్ట్సులో రాణిస్తూ పతకాలు సాధించారు. స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న ప్రత్యేక ప్రతిభావంతురాలు మధులత క్రీడల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

చదువుతో పాటు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ



విద్యాలయంలో చదువుతో పాటు క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. విద్యాలయంలో పీడీలు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యాలయానికి మంచి పేరు తీసుకువస్తున్నారు.

– ఎం.గీత, నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్

• శభాష్.. శివానీ



శివానీ నవోదయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తోంది. షాట్ పుట్, జావలింగ్ త్రో ఆటల్లో రాణిస్తోంది. ఇటీవల జాతీయ స్థాయిలో థాయ్‌లాండ్‌లో నిర్వహించిన పారా స్పోర్ట్స్ షాట్‌పుట్ విభాగంలో మూడు బంగారు పతకాలు, ఒక క్యాంసం సాధించింది. 100 మీటర్ల పరుగు పందెంలో ఒక బంగారు పతకం, జావెలిన్ త్రోలో నాలుగు బంగారు పతకాలతో సత్తా చాటింది. విద్యాలయ ప్రిన్సిపాల్, పీఈటీల సహకారంతో క్రీడల్లో పాల్గొంటుంటుంది.

• యోగాలో మధులత



స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మధులత పారా స్పోర్ట్సు విభాగంలో యోగాలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోంది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన మొదటి పారా యోగసనా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని అండర్–17 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. యోగా గురువు మాస్టర్ అనిత వద్ద శిక్షణ తీసుకుంది. తనకు వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి సహకారంతో యోగాలో రాణిసున్నట్లు తెలిపింది.

• హ్యాండ్ సైక్లింగ్‌లో చందన



చందన నవోదయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల తోడ్పాటుతో క్రీడల్లో ప్రతిభ చూపుతోంది. ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన పారా స్పోర్ట్స్‌లో హ్యాండ్ సైక్లింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ అందుకుంది. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తితో ముందుకు వెళ్లడమే కాకుండా రాణిస్తూ పతకాలు గెలవడంలో పట్టు సాధించింది. విద్యాలయ ప్రిన్సిపల్, పీడీల సహకారంతో భవిష్యత్తులో మరింత సత్తా చాటాలని అంచనాలు పెట్టుకుని సాధన చేస్తోంది.

జిల్లా స్పోర్ట్స్ అధికారికి సన్మానం

రాయచోటి టౌన్ : జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డీఎస్డీఓ) గా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను జిల్లా హాకీ కార్యదర్శి ఇడగొట్టు నాగేశ్వరావు, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన్ను కలసి సన్మానించారు. డీఎస్డీఓ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని విద్యార్థులకు క్రీడలపై మక్కువ పెంచి వారిలోని ప్రతిభ వెలికి తీసే ప్రయత్నం చేస్తానన్నారు. రాయచోటిలో హాకీ క్రీడపై విద్యార్థుల మక్కువ ఉందని దీనిపై దృష్టి సారిస్తామని చెప్పారు.

సురక్ష యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె రూరల్ : నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం మదనపల్లె పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కల్తీమద్యం నివారణ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం సురక్ష యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. జిల్లాలోని 122 మద్యం దుకాణాలు, 11 బార్లలోని వర్కర్లు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, విక్రయించే ప్రతి బాటిల్‌ను స్కాన్‌చేసి వినియోగదారుడికి ఇవ్వాలన్నారు. వినియోగదారుడు ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తాను కొనుగోలు చేస్తున్న మద్యం బాటిల్ వివరాలను తెలుసుకోవచ్చన్నారు. కల్తీ మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు వినియోగదారుడి దృష్టికి వస్తే స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.